క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్ ప్రతిభ


పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ చిన్నారి

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న చిన్నారి ఇటీవల బిలాయ్ పట్టణంలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగా మహిళా విభాగం పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా పోలీసులతో తలపడి మూడో స్థానంలో నిలిచారు. పతకం సాధించిన చిన్నారిని మల్కాపురం సీఐ విద్యాసాగర్‌తో ఉన్నతాధికారులు అభినందించారు.

స్ఫూర్తి ప్రదాత గాంధీజీ


గాంధీజీ వేషధారణలో చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో మంగళవారం గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వాసుదేవరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాంతి,అహింస మార్గంలో నడిచిన మహాత్మా గాంధీజీ ఎందరికో మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఆయన్ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహాత్ముడి జీవిత చరిత్రపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది.

53 మందికి క్యాంపస్ కొలువులు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుకన్య, అమెజాన్ ప్రతినిధులు

గోపాలపట్నం: ప్రఖ్యాత సంస్థ అమెజాన్‌లో నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఈ మేరకు బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ బెహరా విజయ చైతన్య విద్యార్థులను అభినందించారు. సోమవారం నిర్వహించిన క్యాంప్ ఇంటర్వ్యూల్లో 53 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, అధ్యాపకులు కామేష్, వంశీ, దివ్య పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు సీపీఎం ఆందోళనలు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలుచేయాలని, ఉచితంగా ఇసుక ఇవ్వాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 3 వరకు భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద ధర్నాలు, 4న ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, ధర్నా చేయనున్నట్టు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, ఆర్.ఎస్.ఎన్. మూర్తితో కలిసి మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఆందోళన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు. దీంతో జిల్లాలో సుమారు 50 వేల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి టన్ను ఇసుక ధర రూ.వెయ్యి ఉంటే ప్రస్తుతం రూ.1900 నుంచి రూ.2,300 పెరిగిందని చెప్పారు. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి ఇసుక రావడం ఆగిపోయిందన్నారు.


నిరుపయోగంగా ఉన్న రెస్ట్ రూం, టాయిలెట్లు


వ్యర్థాలతో నిండిన శ్మశాన వాటిక ప్రాంగణం

ఆఖరి మజిలీకీ అవస్థలే!


పిచ్చి మొక్కలతో నిండిన గోపాలపట్నం శ్మశాన వాటిక

- గోపాలపట్నం శ్మశాన వాటికలో వసతులు లేమి
- శిథిలమైన టాయిలెట్లు, రెస్ట్ రూమ్

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశాన వాటికలో వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 90, 91 వార్డుల పరిధిలో ఎవరు మరణించినా ఈ శ్మశానవాటికలో అంత్య క్రియలు నిర్వహిస్తారు. అయితే శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో శవం వెంట వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. శ్మశానవాటిక పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంది. ప్రాంగణమంతా వ్యర్థాలమయం కావడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

నిలువ నీడ లేక ఇబ్బందులు

శ్మశానికి వచ్చే వారు నిరీక్షించడానికి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా.. వానైనా బయట ఉండాల్సిందే. రెస్ట్ రూమ్ కూడా అధ్వానంగా తయారయింది. దీన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పిన నాయకులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. గోపాలపట్నం బీఆర్‌టీఎస్ ఆనుకుని ఉన్న శ్మశాన వాటికనే ఇంత నిర్లక్ష్యంగా వదిలేశారని చెబుతున్నారు. శవ దహన వేదిక షెడ్లు మాత్రమే వేసి తర్వాత దీని గురించి పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

రాళ్ల కుప్పలు తొలగించారు


రోడ్డుపై రాళ్లు తొలగిస్తున్న కూలీలు


రాళ్ల కుప్ప తొలగించిన తర్వాత విశాలంగా రహదారి

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: రైల్వే స్టేషన్ నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డుపై వేసిన రాళ్ల కుప్పలను అధికారులు తొలగించారు. దీనిపై మంగళవారం 'సాక్షి'దినపత్రికలో రాళ్ల కుప్పలతో ఇబ్బందులు అన్న శీర్షికతో వార్త ప్రచురితమయింది. స్పందించిన అధికారులు రాళ్ల కుప్పలను తొలగించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

విత్తన బంతుల తయారీ



విత్తన బంతులు తయారు చేసిన విద్యార్థులతో అతిథులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులోని కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విదార్థులచే విత్తన బంతులను జేడీ ఫౌండేషన్ సభ్యులు తయారు చేయించారు. మట్టిలో సీతాఫలం, నేరేడు, జవ్వి, అశోక, చింత, వెదురు, రావి తదితర విత్తనాలను బంతులుగా తయారు చేశారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని జేడీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ వెంకట రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రోస్క్రాప్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: లాభాల్లో ఉన్న ఫెర్రోస్క్రాప్ నిగం లిమిటెడ్ (ఎఫ్‌ఎస్‌ఎన్‌ఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం ప్రారంభించామని ఫెర్రోస్క్రాప్ నిగం లిమిటెడ్ యూనియన్ అధ్యక్షుడు పి. రాములు, ప్రధానకార్యదర్శి ఎం. అమ్మిరెడ్డి తెలిపారు. ఫెర్రోస్క్రాప్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థను కాపాడుకోవడానికి చేస్తున్న న్యాయ పోరాటం కోసం ఉద్యోగులు, అధికారుల నుంచి రూ.1.75 లక్షలు విరాళాలు సేకరించామన్నారు. ఇప్పటికే ఢిల్లీ, కోల్‌కతా హైకోర్టుల్లో కేసులు వేశామన్నారు. త్వరలో బిలాస్‌పూర్ కోర్టులో కేసు వేయనున్నట్టు తెలిపారు. యూనియన్ చేపట్టే కార్యక్రమాల్లో ఉద్యోగులంతా పాల్గొనడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చునన్నారు. కార్యక్రమంలో పర్సనల్ అధికారి అగ్రహార గుప్తా, అభిషేక్ శర్మ, సి.పి. ఆనంద్, బి. రంగారావు, పి. సర్కార్, పి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు


స్వచ్ఛతా ప్రమాణం చేయిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా పక్వాడా-స్వచ్ఛతా పక్షోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈసందర్భంగా దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. ఈ పక్షోత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో, రైళ్లలో, రైల్వే కాలనీలలో, రైల్వే పరిసరాలలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించే దిశగా పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మహాత్మగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రైల్వేస్టేషన్ ఆవరణలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే రద్దు చెయ్యాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామన మూర్తి డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి మద్దతుగా మంగళవారం నరసింహనగర్ రైతు బజార్‌వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టాక ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ జోలికి వస్తే ఆంధ్రులు కేంద్ర ప్రభుత్వా నికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

డాక్‌యార్డ్ రోడ్డు సందర్శన

సింధియా: నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ మార్గం కోసం మంగళవారం ఎమ్మెల్యే గణబాబు డాక్‌యార్డ్ రోడ్డును సందర్శించారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంతెన పునర్నిర్మాణం నిమిత్తం ఆ మార్గాన్ని మూసివేశారు. కాన్వెంట్ జంక్షన్, మేఘన పేట, అశోకపార్క్ నుంచి డాక్‌యార్డ్‌కు వచ్చే నేవల్ ఉద్యోగులు షీలానగర్ వెళ్లి తిరిగి కృష్ణ గేటుకు రావడంతో 13 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి రావడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నామని ఉద్యోగులు వాపోయారు. తాత్కాలికంగా ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతించాలే చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు ఎమ్మెల్యే గణబాబును కోరారు.

35 కిలోల గంజాయి పట్టివేత

గోపాలపట్నం: గోపాలపట్నంలో 35 కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేష్ తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం తూతుకూడి ప్రాంతానికి చెందిన ఐదుగురు అరుకు ప్రాంతంలో 35 కిలోల గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డులో పట్టుకున్నారు. 35 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం రైతు బజార్‌లో రైతులకు మంగళవారం కళాకారులు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. జీవీఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో కళాజాత బృందాలు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని, రైతులు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. రైతు బజార్‌ఈవో కొమ్మనాపల్లి వరహాలు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, రైతు బజార్ సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

వేడుకగా దసరా ఉత్సవాలు


వేడుకల్లో విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కొత్తరోడ్‌లోని రామకృష్ణా పాఠశాలలో మంగళవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియ జేయాలనే లక్ష్యంతో ఉత్సవాలు నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో రామకృష్ణా పాఠశాలల అధినేత కృష్ణారెడ్డి , ఉపాధ్యాయులు రవీంద్రుడు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

దాబాగార్డెన్స్: బీఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ వేడకలను దాబాగార్డెన్స్‌లో గల బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఆంధ్రా మెడికల్స్, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పటల్స్, వాసన్ కేర్ హాస్పటల్స్ ద్వారా ఉద్యోగుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున ఉద్యోగులు ర్యాలీ చేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, జైల్‌రోడ్డు, జడ్జికోర్టు జంక్షన్, జగదాంబ సెంటర్, సరస్వతీ పార్క్ జంక్షన్ మీదుగా తిరిగి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బీఎస్‌ఎన్‌ఎల్ పీజీఎంటీడీ పాల్ విలియం మాట్లాడుతూ హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్, 4జీ సేవల గురించి వివరించారు. పీజీఎం(ఆపరేషన్స్) ఆడమ్ మాట్లాడుతూ ఎఫ్‌టీటీహెచ్ సేవలు, ఎంఎన్‌పీ బుకింగ్‌ల మెరుగుదల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి. శ్రీనివాసరావు, ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుదాం


సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

- కూటమి పాలనలో లోపాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: ప్రజలకు మేలు చేయడమే వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. అతని మార్గదర్శకంలో ప్రజల పక్షాన పోరాడుదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్తగా నియమితులైన మళ్ల విజయప్రసాద మంగళవారం సాయంత్రం 60వ వార్డు శ్రీహరిపురంలోని పార్టీ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని బాకాలు ఊదే చంద్రబాబుకు జగన్ అంటే దడ అని అన్నారు. అధికారం కోసం చంద్రబాబులా ప్రజలను బురిడీ కొట్టించడం జగన్‌కు తెలియదన్నారు. కూటమి నేతలు హామీలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు వదులుకున్నామనా అని పశ్చాత్తాపం పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలు ఒక్కటి అమలు చేయలేదన్నారు. దీనిపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

మత్తులో ముంచడమే బాబు ధ్యేయం

ప్రజలను మద్యం మత్తులో ముంచడమే లక్ష్యంగా చంద్రబాబు నూతన మద్యం పాలసీ తీసుకువచ్చారని మళ్ల ధ్వజమెత్తారు. ఈ పాలసీని మహిళలు వ్యతిరేకిస్తున్నా ఆదాయం కోసం ప్రైవేటుకే అప్పగిస్తున్నారన్నారు. దీనిపై ఉద్యమాలు చేయడానికి వారు సిద్ధపడుతున్నారన్నారు. ప్రజల పక్షాన అంతా కలిసి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.అలాగే సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తారని భయపడి తిరుమల లడ్డూపై చంద్రబాబు తప్పుడు ప్రచారానికి తెర తీశారన్నారు. ఇలాంటి వాటిని ఎక్కడికక్క తిప్పికొట్టాలని నాయకులకు సూచించారు. అలాగే వార్డుల పరిధిలో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే టీడీపీ,జనసేన నాయకుల అవినీతి, అక్రమాలను ప్రశ్నించి ప్రజలకు అండగా నిలవాలన్నారు.

అండగా ఉంటాం

కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కూటమి నాయకుల బెదిరింపులకు అతి త్వరలో కాలం చెల్లనుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు డాక్టర్ పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు,బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధ, వార్డుల అధ్యక్షులు కేబుల్ వాసు, రేవళ్ల సత్యనారాయణ,పాడుగు రాజు,మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్,గులిగిందల కృష్ణ,చట్టి నూకరాజుయాదవ్,బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా స్వచ్ఛభారత్



కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకులు

మల్కాపురం: యువత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమం మాదిరిగా నిర్వహించాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత హీ సేవా 4.0 కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని,క్లాత్ లేదా పేపర్‌తో చేసిన బ్యాగులు వినియోగించాలని కోరారు. చుట్టుపక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మీ ప్రాంతంతో పాటు మీ నగరం ఎంతో సుందరంగా నిలుస్తుందన్నారు. ఇళ్లకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం జిల్లా అధికారి భాగ్యలక్ష్మి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లో బీజేపీ కన్వీనర్ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గీతం ఆస్పత్రి వైద్యులు రోగులకు సేవలు అందించారు. ఎమ్మెల్యే గణబాబు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి శిబిరాన్ని సందర్శించి రోగులకు మందులు పంపిణీ చేశారు. బీజేపీ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ ప్రధాన నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధాశ్రమంలో దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


మృతుడు అప్పన్న

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్కేబీచ్ వద్ద మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. దీన్ని గమనించిన సందర్శకులు బీచ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మురళీనగర్‌కు చెందిన మామిడి అప్పన్నగా గుర్తించారు. మద్యానికి బానిసైన అప్పన్నకు కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగోలేదు. మద్యం తాగేందుకు రెండు రోజులుగా ఆయన భార్య డబ్బులు ఇవ్వలేదు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రజాభిప్రాయంతో పథకాలు రూపొందించాలి

మద్దిలపాలెం: ప్రజల అభిప్రాయాలతో ప్రభుత్వ పథకాలు రూపొందిస్తే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. ఏయూ ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర 2047 భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 ప్రాముఖ్యతను వివరిస్తూ, పథకాలను ప్రజాసహకారంతో రూపొందించడం వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళికకు సంబంధించిన 12 ప్రధాన రంగాలపై చర్చలు జరిగాయి. వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పెరుగుదల, ఆరోగ్య సంరక్షణ, విద్యారంగంలో నైపుణ్యాల పెంపు వంటి అంశాలు ప్రధానంగా చర్చించారు. కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలు రాష్ట్ర ప్రణాళిక విభాగానికి పంపించనున్నారు. అధ్యాపకులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.